# ప్రజలదే భారం!

**మా** యజమానులు నన్ను నట గండభేరుండను ఇంటర్వ్యూ చేసి, ఆ చేత్తోనే కలర్ ఎడ్వర్టయిజ్‌మెంట్ ఒడుచుకు రమ్మన్నారు.

గండభేరుండం గారికి సాష్టాంగ దండ ప్రణామాలాచరించి, గండంగారూ, మీరు నటించిన చిత్రం "చవట చిన్నోడు" నూరు వారాలు పోయేట్టున్నందుకు ప్రపంచ ప్రజానీకమంతా గర్వించదగిన మాట నిజమే గాని, అది బొత్తిగా చవుకబారు అభిరుచులతో కూడి వున్నదని ఒకరూ, ఇద్దరూ కాదు, అనేకమంది అనటం గురించి తవరేమంటారు?" అని అడిగాను.

దానికి భేరుండంగారు, "నాకు ఒకరితో పనిలేదు. ప్రజాభిప్రాయానికి తలొంచుతాను" అని నాకేసి తలొంచాడు, ప్రజాభిప్రాయన్నట్టు.

ఇది తొమ్మిదినెల్ల కిందటిమాట. ఈ లోపుగా గండభేరుండగారు నటించిన చిత్రాలు మూడు టపాకాయలు పేలినట్టు పేలాయి. ఈసారికి నేనే శ్రీవారిని కలుసుకుని, "తవరి పిచ్చేర్లీ మధ్య రెండు మూడు రోజులైనా ఆడక్క పోవటానికి కారణం ఏమిటంటారు?" అనడిగాను.

శ్రీవారు పెదవి విరిచి తల ఒక పక్కకు వంచి ఆలోచించి, "చూడండీ! మన పిచ్చేర్లలో మంచి అభిరుచి ప్రతిబింబించేటట్టు చూసే బాధ్యత ప్రజలది. దిగజారిపోతున్న చలన విచిత్ర పరిశ్రమను ప్రజలే ఉద్ధరించాలి" అని సెలవిచ్చారు.

***ముద్రణ : యువ, డిసెంబర్ 1977***